ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
బుధవారం 8 అక్టోబరు 2025



వైన్స్‌కు మరో మూడు దరఖాస్తులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 94 వైన్‌షాపులకు ఇప్పటి వరకు 45 దరఖాస్తులు అందాయి. సోమవారం వరకు 42 దరఖాస్తులు రాగా, మంగళవారం మరో మూడు దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు, జమ్మికుంట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక దరఖాస్తు అందినట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 18వ తేది సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఎక్సైజ్ శాఖ అవకాశం కల్పించింది.

కాంగ్రెస్‌లో మాటల యుద్ధం



- మంత్రి అడ్లూరిపై 'పొన్నం' అనుచిత వ్యాఖ్యలు
- భగ్గుమన్న అనుచరులు, సామాజికవర్గ నాయకులు
- పొన్నం దిష్టిబొమ్మలు దహనం
- క్షమాపణ చెప్పాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్‌లో మాటల యుద్ధం ప్రారంభమైంది. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వాఖ్యలు జిల్లాలో రాజకీయవేడిని రాజేస్తున్నాయి. మంత్రి పొన్నం చేసిన వాఖ్యలు ఆయన మెడకే కాకుండా మరో మంత్రి వివేక్ వెంకట్‌స్వామికి కూడా చుట్టుకుంటున్నాయి. ఒక సమావేశానికి ఆలస్యమయ్యాడన్న కారణంతో మంత్రి పొన్నం ప్రభాకర్ 'మనకు టైమంటే తెలుసు... జీవితమంటే తెలుసు...దున్నపోతు వానికేమి తెలుసు' అంటూ వ్యాఖ్యలు చేశారు.దీనిపై లక్ష్మణ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. 'పొన్నం ప్రభాకర్ లాగా అహంకారంగా మాట్లాడడం నాకు రాదు... దళితుల కుటుంబం లో పుట్టడం నా తప్పా... ఆయన నన్నే కాదు మా జాతినందరిని అవమానించారు. 24 గంటల్లోగా జరిగిన దానికి ఆయన క్షమాపణ చెప్పకపోతే జరుగబోయే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలి'... అంటూ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు. తనను అవమాన పరిచే విధంగా మాట్లాడిన సమయంలో అక్కడే ఉన్న దళిత మంత్రి వివేక్ వెంకటస్వామి దానిని ఏ మాత్రం ఖండించక పోవడాన్ని ఆయన తప్పుబట్టారు. మొదటి నుంచి మాదిగ సామాజిక వర్గాన్ని వివేక్ వ్యతిరేకిస్తూ వస్తున్నారని, తాను మంత్రి కావడం ఆయనకు ఇష్టం లేదు.. నేను వస్తానంటే ఆయన వెళ్లిపోతానంటున్నారు.. అంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. మంత్రుల తీరును తాను సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గే, మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన అన్నారు.

మంత్రుల మధ్య సమన్వయ లోపం

జిల్లాలో ఇప్పటికే మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మధ్య సఖ్యత కొరవడింది. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శ్రీధర్‌బాబుకు సన్నిహితుడు కావడంతోనే శ్రీధర్‌బాబుకు వ్యతిరేక వర్గమైన మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం జీర్ణించుకోలేక పోతున్నారని మాదిగ సామాజికవర్గ నేతలు ఆరోపిస్తున్నారు. ఆ నేపథ్యంలోనే అసహనంతో ఇలా ప్రవర్తిస్తున్నారని వారంటున్నారు.

తీవ్రంగా పరిగణించిన సామాజికవర్గం

మంత్రి అడ్లూరికి జరిగిన అవమానాన్ని మాదిగ సామాజిక వర్గం తీవ్రంగా పరిగణిస్తోంది. మంత్రికి మద్దతుగా పలు చోట్ల మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్ తెలంగాణ చౌక్, చిగురుమామిడి మండల కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కరీంనగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పకపోతే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ఆందోళనలో స్థానిక నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ వివాదం తలెత్తడం పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తుందని కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సెప్టెంబరు 17న ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కరీంనగదర్ జిల్లాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ జీర్ణించుకోలేక పోతున్నాడని, ఆయన ఈ విషయాన్ని బాహటంగానే వ్యక్తం చేసిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ముగ్గురు మంత్రుల మధ్య వివాదంతో జిల్లాలో పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పీసీసీ సర్దుబాటు చర్యలు

మొదట ఈ వ్యవహారాన్ని చిన్న విషయం గానే భావించిన టీపీసీసీ జరుగుతున్న నష్టాన్ని గమనించిన తర్వాత సర్దుబాటు చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ ఇది ఇంటి సమస్య అని, త్వరలోనే పరిష్కరించుకుంటామని వ్యాఖ్యానించారు. శ్రీధర్ బాబుతోనూ ఈ విషయం మాట్లాడినట్లు సమాచారం. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్‌స్వామి క్షమాపణలు చెప్పాల్సిందే నని మాదిగ సామాజికవర్గ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్‌ను గవర్నర్ ఆమోదించాలి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని బీసీలంతా పోరాడి సాధించుకున్న 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను గవర్నర్ ఆమోదించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రంగౌడ్ కోరారు. కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. 42 శాతం రిజర్వేషన్‌ను రెడ్డి సంఘం నేతలు అడుగడుగునా అడ్డుకుంటున్నారని విమర్శించారు. బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావలసిన వాటాను అడ్డుకుంటున్న వారికి బుద్ధి చెప్పడానికి శాంతియుత నిరసన నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్నం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్‌చారి, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరశురామ్, రాష్ట్ర సహాయకార్యదర్శి రంగు సంపత్, ప్రచార కార్యదర్శి జీఎస్ ఆనంద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాచర్ల అంజయ్య, పార్లమెంట్ కన్వీనర్ కాయితోజు బ్రహ్మచారి పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై ఎన్నికల నోడల్ అధి కారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వశాఖలు, సంస్థల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని, అలాంటి వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, డీఆర్వో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎంపికకు కసరత్తు

- ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



హుజూరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు గుర్రాల కోసం ప్రధాన రాజ కీయ పార్టీలైనా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు అన్వేషి స్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలు వడిన వెంటనే వ్యూహ ప్రతి వ్యూహాల్లో రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మండలాల వారీగా బీఆర్‌ఎస్ ముఖ్య కార్య కర్తల సమావేశాలు నిర్వహించి, ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, అభ్యర్థుల జాబితాను ఖరారు చేయడానికి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశారు. ఒక్కో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు దరఖాస్తులు స్వీకరించి, సర్వే ఆధారంగా ప్రజలతో మమేకమై గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థిని ఎంపిక చేయాల్సిందిగా సమన్వయ కమిటీకి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సూచించారు. అభ్యర్థుల ఎంపిక ఏకగ్రీవం కానీ పరిస్థితుల్లో తన దృష్టికి తీసుకువస్తే సామరస్యంగా ఎంపిక చేసి మిగితా కార్యకర్తలకు భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తానని ఇప్పటికే భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ అధిష్ఠానం సూచన మేరకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ ఆశావాహుల జాబితాను సేకరించారు. ఒక్కో స్థానం నుంచి ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేసి అధిష్ఠానానికి పంపించినట్లు తెలిసింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థు లను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. మహిళలకు ఫ్రీ బస్సు, రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల లోపు గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ తమను గట్టెక్కిస్తాయని కాం గ్రెస్ కార్యకర్తలు బావిస్తున్నారు. ఎలా గైనా నియోజకవర్గంలో మెజార్టీ జడ్పీ టీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమాతో ఉన్నారు.

బీజేపీ అభ్యర్థుల జాబితా విష యంలో కొంత గందరగోళం ఏర్పడిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి 20 23లో ఓడిపోయిన ఈటల రాజేందర్ అనతరం మల్కాజిగిరి ఎంపీగా గెలుపొందారు. కరీంనగర్ ఎంపీగా గెలుపొంది కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కుమార్ పరిధిలో హుజూరాబాద్ నియోజకవర్గం ఉండడంతో ఆశావా హులు రెండు వర్గాలుగా విడిపోయారనే అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాయకులు ఈటల, బండి గ్రూప్‌లుగా విడిపోవడం తో బీజేపీకి చెందిన ఆశావాహులు కొంత నిరాశకు గురవుతున్నారు.

హైకోర్టు తీర్పు కోసం వేచి చూస్తున్న ఆశావహులు

స్థానిక సంస్థల్లో బీసీలకు42 శాతం రిజర్వేషన్ కల్పి స్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిది. దీనిని సవాల్ చేస్తూ రెడ్డి జాగృతికి చెందిన మాధవరెడ్డి అనే వ్యక్తి హైకోర్టుకు వెళ్లారు. బుధవారం హైకోర్టు ఇచ్చే తీర్పుపై ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు 50 శాతం మించకుండా రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగిస్తే ప్రభుత్వం బీసీలకు కల్పించిన 42శాతం రిజర్వేషన్లు అమలుకు నోచుకునే అవకాశాలు ఉండకపోవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. హైకోర్టులో ప్రభుత్వానికి చుక్కెదురైతే పాత రిజర్వేషన్ల ప్రకారం తిరిగి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. దీంతో ఎన్నిక నిర్వాహణ ఆలస్యం అవుతుంది. హైకోర్టు తీర్పుపై ఆశావాహులు ఉత్కంఠతో ఉన్నారు.

బకాయిలు చెల్లించాలి..

- కలెక్టరేట్ ఎదుట బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థుల ధర్నా

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం చెల్లించి తమకు విద్యను అందించాలని బెస్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యా సంస్థల యాజామాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. పాఠశాలల నిర్వహణ సాధ్యం కాదని చేతులెత్తేశార న్నారు. తమ పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందన్నారు. జిల్లాలో 15 ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ పిల్లలు చదువుకుంటు న్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు

తిమ్మాపూర్: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలు చెల్లించాలని ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కోరారు. ఎల్‌ఎండీలోని క్యాంప్ కార్యాలయంలో వారు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించడం లేదని తమ పిల్లలను పాఠశాలలకు రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు.

ఏసీబీ వలలో డ్రగ్ కంట్రోలర్ అధికారులు
6
విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం
• జాతీయ డిజిటల్ సైన్స్-2025 టాలెంట్ టెస్ట్‌కు శ్రీకారం

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమావేశ మందిరంలో వాల్మీకి మహర్షి జయం తి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పమేలా సత్పతితోపాటు ఉన్న తాధికారులు పూలమాలలు వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ వాల్మీకి సత్యం, ధ ర్మం, న్యాయం, సేవా వంటి విలువలను సమాజా నికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో బి వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమశాఖ అధికారి అనిల్ ప్రకాశ్, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

'అమృత్' పనులను త్వరగా పూర్తి చేయాలి

- రెండు రోజుల్లో సంపు నిర్మాణ పనులు ప్రారంభించండి
- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం నిధులతో చేపడుతున్న మంచినీటి అభివృద్ధి పనులన్నింటిని త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మానేరు డ్యాం సమీపంలోని మంచినీటి శుద్దీకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ మంచినీటి సరఫరాకు సంబంధించిన బూస్టర్ పంపుహౌస్ వాల్వ్ రిపేర్స్, పైపులైన్ లీకేజీకి సంబంధించిన పనులు చేప ట్టాలని ఆదేశించారు. మెటీరియల్‌తో పాటు లేబ ర్లను ముందే సమకూర్చుకోవాలని అన్నారు. అమృత్‌లో భాగంగా నిర్మిస్తున్న 10 ఎంఎల్‌డీ ఫిల్టర్ బెడ్ పనులను నెలరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. 14, 34 ఫిల్టర్ల నుంచి వచ్చిన బ్యాక్ వాషింగ్ వాటర్‌ను తిరిగి ఉపయోగించేందుకు వీలుగా రెండు రోజుల్లో సంపు నిర్మాణ పనులను ప్రారంభిం చాలన్నారు. వాటర్ పైపులైన్ పంపులు, వాల్వ్, ఇతర మరమ్మతు పనులకు సంబంధించి అంచనాలు తయారు చేసి పనులను చేపట్టాల న్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రొడ్డ యాదగిరి, సంజీవ్ కుమార్, డీఈ దేవేందర్, ఫిల్టర్ బెడ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫిల్టర్‌బెడ్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ వెంకట్

శంకరపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనాలు తనిఖీ చేసి నంబర్ ప్లేట్ లేని 22 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం సీఐ వెంకట్ రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృత్యువాత



సాగర్ (ఫైల్)

జమ్మికుంట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికి చెందిన పంజాల సాగర్ (45) ధర్మారం పరిధిలోని రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సాగర్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై కిరాణ సామగ్రి కోసం జమ్మికుంటకు బయలుదేరాడు. ధర్మారం రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మల్లయ్య (ఫైల్)

వెల్గటూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన బోగ మల్లయ్య (42) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మల్లయ్య ఈనెల 2న రాత్రి రోడ్డు దాటుతుండగా ధర్మారావుపేటకు చెందిన కొప్పు సాయికుమార్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ మల్లయ్యను ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన మల్లయ్య కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

రూ.6,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,400 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 52 మంది రైతులు 319 క్వింటాళ్ల విడి పత్తి, 16 మంది రైతులు 19 క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.6,400, కనిష్ఠ ధర రూ.3500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఇంటర్ విద్యార్థి మొగుళ్ల యశ్వంత్‌ను ఢీకొట్టి ప్రమాదానికి కారణమైన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన మలావత్ గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని మొగుళ్ల యశ్వంత్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు. గత నెల 20న రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట బస్టాండులో దిగి కళాశాలకు రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా తాడ్వాయికి చెందిన గణేశ్ తన బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడని చెప్పారు. తీవ్ర గాయాలపాలైన యశ్వంత్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని పేర్కొన్నారు. విద్యార్థి సోదరుడు సాయితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం..







విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ద్వారా నగదు బహుమతులు, స్కాలర్‌షిప్‌లు

జాతీయ డిజిటల్ సైన్స్-2025 టాలెంట్ టెస్ట్‌కు శ్రీకారం

చొప్పదండి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పరిశోధకులుగా, భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం)ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీస్తోంది. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక, సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసార్, విజ్ఞాన భారతి సంస్థలు సంయుక్తంగా ప్రతి సంవత్సరం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తాయి.

దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఆరు నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు.. 2025-26 సంవత్సరానికిగాను వీవీఎం దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈ నెల 30 వరకు గడువు విధించారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ లక్ష్యాలు...

సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి కల్పిస్తూ శాస్త్ర, సాంకేతిక రంగంలో అభివృద్ధి వివరాలను విద్యార్థులకు తెలియజేడయమే లక్ష్యం. ఉన్నతస్థాయి వైజ్ఞానిక విద్యను అభ్యసించేందుకు అవసరమైన మార్గాలను ఏర్పాటు చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం లక్ష్యం. జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు భాస్కర స్కాలర్‌షిప్‌ను కూడా అందజేస్తారు.

పరీక్ష విధానం...

వీవీఎం-2025 పరీక్షలో పాల్గొనేందుకు దేశ వ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ రాష్ట్ర బోర్డులు అనుమతి పొందిన పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదివే విద్యార్థులు జూనియర్ విభాగంలో, 9, 10, 11 తరగతులు చదివే విద్యార్థులు సీనియర్ విభాగంలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇంగ్లీష్, హిందీతో పాటు 14 ప్రాంతీయ భాషల్లో పరీక్షను నిర్వహిస్తారు. ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన విద్యార్థులను ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. మొదటి బహుమతిగా 25 వేలు, రెండో బహుమతిగా 15 వేలు, మూడో బహుమతిగా 10 వేల రూపాయల చొప్పున అందజేస్తారు. జాతీయస్థాయిలో అదనంగా నాలుగు జోన్ల నుంచి ప్రతి తరగతి నుంచి మొత్తం 18 మందికి ప్రత్యేకంగా నగదు పారితోషకాలు అందజేస్తారు. జాతీయస్థాయిలో బహుమతి సాధించిన విద్యార్థులకు ప్రతినెల రెండు వేల రూపాయల చొప్పున ఏడాదిపాటు భాస్కర స్కాలర్‌షిప్‌ను అందజేస్తారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

వీవీఎం పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు www.vvm.org.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా పేరును నమోదు చేసుకోవాలి. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. విద్యార్థి వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్టర్ చేసుకోవాలి. పాఠశాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తారు.

కనీసం 50 మంది ఒకే పాఠశాల నుంచి దరఖాస్తు చేసుకుంటే కంప్యూటర్ ఇంటర్‌నెట్ సౌకర్యం ఉన్నట్లయితే అక్కడే పరీక్షా కేంద్రాన్ని కేటాయించే అవకాశం ఉంటుంది. ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష వచ్చే నెలలో ఉండే అవకాశాలు ఉంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 గంటల మధ్య ఎప్పుడైనా 90 నిమిషాల పాటు పరీక్ష నిర్వహిస్తారు.

తల్లిని బెదిరించిన కేసులో కొడుకుకు జైలుశిక్ష

పాలకుర్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రామారావుపల్లెలో తల్లిని చంపుతానని బెదిరించిన కేసులో కొడుకు జైలుపాలయ్యాడు. ఎస్ఐ స్వామి తెలిపిన వివరాల మేరకు రామారావుపల్లి గ్రామానికి చెందిన సందవేన రమేష్ గతేడాది డిసెంబరులో తండ్రి సందవేన శంకర్‌ను కుటుంబ కలహాలు మనసులో పెట్టుకొని హతమార్చాడు. ఆ కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరిగి వచ్చాడు. కేసు కోర్టులో నడుస్తుండగానే కేసుపెట్టిన తల్లి సందవేన గట్టమ్మని చంపుతానని బెదిరించాడు. దీంతో ఆమె జూన్ 12న బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టు కానిస్టేబుల్ ఎన్ రమేష్, లైజెనింగ్ ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా ఏపీపీ నహేద పర్వీన్ వాదనలు వినిపించారు. మంగళవారం గోదావరిఖని మేజిస్ట్రేట్ దురువ వెంకటేష్ రమేష్‌కు మూడు నెలల 16 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన ఎస్ఐ స్వామి, కోర్టు కానిస్టేబుల్ రమేష్‌ను సీఐ, ఏసీపీ అభినందించారు.

వరి పంటపై పందుల దాడి

మల్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి, రామన్నపేట గ్రామాల పరిధిలో గల వరి పంటను నూకపల్లికి చెందిన కొందరి పందులు ధ్వంసం చేస్తున్నాయంటూ మంగళవారం పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతి ఏటా పందుల దాడితో తీవ్రంగా నష్టం పోతున్నామని, రెండు రోజులుగా కూడా పందులు పంటను నష్టపరుస్తున్నాయని రైతులు తెలిపారు. పందుల యజమానుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని, తగు చర్యలు తీసుకోవాలని రైతులు పోలీసులను కోరారు.

దాడికి పాల్పడిన సంఘటనలో ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిలో తనకు వాటా ఉందని ఎందుకు దున్నుతున్నారంటూ మహిళపై దాడి చేసిన ఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన బాలరాజు నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలోని బాలరాజు కావ్య తన భర్త నర్సాగౌడ్‌లు కలిసి ఇటీవల వరి పంటను కోసి గ్రామ శివారులో ఉన్న ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబెట్టారని పేర్కొన్నారు. ఈ నెల 7న బాలరాజు నరేశ్ అక్కడకు చేరుకుని వ్యవసాయ భూమిలో తనకు వాటా ఉందని పేర్కొంటూ గొడవకు దిగాడని వివరించారు.

అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు బండరాయితో కావ్యపై దాడి చేశాడని పేర్కొన్నారు. అంతటిలో ఆగని నరేశ్ కావ్య భర్త నర్సాగౌడ్ ముఖంపై కొట్టగా గాయమైందని తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఏసీబీ వలలో డ్రగ్ కంట్రోలర్ అధికారులు

- రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏడీ, ఇన్‌స్పెక్టర్, సహాయకుడి అరెస్టు - డ్రగ్ కంట్రోల్ కార్యాలయంలో తనిఖీ





ఏసీబీకి చిక్కిన ఏడీ శ్రీనివాసులు, డీఐ కార్తీక్‌రెడ్డి, ప్రైవేట్ ఉద్యోగి రాము, వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో మెడికల్ షాపు నిర్వాహకుడి వద్ద నుంచి లంచం తీసుకున్న కేసులో ఇద్దరు డ్రగ్ కంట్రోలర్ అధికారులతోపాటు ఓ సహాయకుడు మంగళవారం అరెస్ట్ అయ్యారు. కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రగ్ కంట్రోల్ ఏడీ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్ భరద్వాజతోపాటు వారికి సహాయకుడిగా పనిచేస్తున్న ఒక ప్రైవేట్ వ్యక్తి పుల్లూరి రామును అరెస్టు చేశారు. డీఎస్పీ వివరాల ప్రకారం.. కరీంనగర్ కోర్టు సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ మెడికల్ షాపు లైసెన్స్ రెన్యూవల్ చేసేందుకు నిర్వాహకుడిని డ్రగ్ కంట్రోల్ ఏడీ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్ భరద్వాజరెడ్డి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిర్యాదుదారుడి వద్ద నుంచి రూ.20 వేలు తీసుకురావాలని కార్యాలయంలో ప్రైవేట్ సహాయకుడిగా పనిచేస్తున్న రామును సదరు హాస్పిటల్‌కు పంపించారు. మంగళవారం సాయంత్రం ఆస్పత్రి సమీపంలో రోడ్డుపై నిర్వాహకుడి వద్ద నుంచి రాము రూ. 20 వేలు తీసుకుంటుండగా అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం కరీంనగర్ చైతన్యపురిలోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. పలు మెడికల్ షాపుల లైసెన్స్‌లకు సంబంధించిన ఫైల్స్‌ను, ఇతర రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కార్యాలయంలో ఉన్న డ్రగ్ కంట్రోల్ ఏడీ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్ భరద్వాజరెడ్డిని అరెస్టు చేశారు. లంచం డబ్బులు సీజ్ చేశామని, ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నామని డీఎస్పీ తెలిపారు. విచారణ అనంతరం ముగ్గురిని బుధవారం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు చెప్పారు.

● లంచం లేనిదే మెడికల్ షాపు లైసెన్స్ రెన్యూవల్ కాదు

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్‌షాపుల్లో చాలా వరకు ఫార్మసిస్టులు లేకుండానే నడుస్తున్నాయనే ఆరోపణలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 400పైగా ప్రైవేట్ ఆస్పత్రులు, 800పైగా మెడికల్ షాపులు నడుస్తున్నట్లు అంచనా. ఈ ఆస్పత్రులు, మెడికల్‌షాపుల్లో ఫార్మాసిస్టుల సర్టిఫికెట్‌తో లైసెన్స్‌లు తీసుకొని ఔషధాలపై పరిజ్ఞానంలేని వారు నడిపిస్తున్నారని, ఇది ప్రమాదకరమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు నెలనెలా మామూళ్లు ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు కరీంనగర్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులపై ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. లంచాల కోసం వేధింపులు భరించలేకనే ఏసీబీని ఆశ్రయించారని సమాచారం.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

కోరుట్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్యాలవాడలో ఉంటున్న చిరుమల్ల రాజగంగా రాం-సరళ దంపతుల ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. చిరుమల్ల రాజగంగారాం- సరళ దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా కుటుంబంతో కలిసి తిరుపతి దైవదర్శనానికి నాలుగు రోజు క్రితం వెళ్లారు. మంగళవారం రాజగంగారాం ఇంటి తలుపు తెరిచి ఉన్న విషయాన్ని పొరుగింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దొంగతనం విషయం చిరుమల్ల రాజగంగారంనకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కాగా రాజగంగారం ఇంట్లోని బీరువాలో ఏడు తులాల బంగారం, రెండు కేజీల వెండి, లక్ష రూపాయల నగదు ఉందని తెలిపాడు. కాగా బాధితుడు ఇంటికి తిరిగి వస్తే ఎంత అపహరణకు గురైందో తెలుస్తుంది. కాగా పోలీసులు కాలనీలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.



కిరాణా యజమాని ప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్సై శ్రీనివాస్

కిరాణ షాపులో దొంగతనం..

వెల్గటూర్: మండల కేంద్రంలోని బాలాజీ కిరాణంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు రేణికుంట ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడం గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సీసీ ఫుటేజీని పరిశీలించారు. అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి రాగా ఒకరు మాత్రమే లోనికి చొరబడినట్లు నిర్ధారించారు. దుండగుడు 15,000 రూపాయలు అపహరించినట్లు బాధితుడు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శిథిలావస్థలో విశ్రాంతి భవనం

- 18 ఏళ్లుగా ఆలనాపాలనా కరువు - వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు

గంగాధర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండు కాదు 40 ఏళ్లనాటి పురాతన విశ్రాంతి భవనం. కొన్ని తరాల నుంచి మంత్రులు, పాలకులకు, అధికారులకు ఎందరికో ఆతిథ్యం ఇచ్చిన అలనాటి అద్భుతమైన భవనం నేడు వినియోగంలో లేకపోవడంతో శిథిలమై కనుమరుగవుతోంది. చొప్పదండి నియోజకవర్గంలో గంగాధర సమితిగా ఉన్న సమయంలో ఇక్కడ విశ్రాంతి భవనం నిర్మించాలని ప్రతిపాదించారు. గంగాధర మండల కేంద్రంలో నిర్మించిన గెస్ట్‌హౌస్‌ను 1962లో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులకు సుమారుగా 40 సంవత్సరాలు ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చింది. 18 సంవత్సరాలుగా ఆలనాపాలనా లేకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మండల కేంద్రంలో సుమారుగా ఆరు గుంటల విస్తీర్ణంలో స్థలం మధ్యలో నిర్మించిన గెస్ట్ హౌస్ నేడు వెలవెలబోతోంది. ఇక్కడికి అధికారిక కార్యక్రమాలకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు వసతులు లేకపోవడంతో కరీంనగర్ వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా గెస్ట్‌హౌస్‌కు మరమ్మతులు చేయించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది.



శిథిలావస్థకు చేరిన గంగాధర మండల కేంద్రంలోని గెస్ట్ హౌస్

ఇంట్లోకి చొరబడి మహిళపై హత్యాయత్నం

- అడ్డువచ్చిన వృద్ధుడిపై దాడి

- పట్టుకొని కట్టేసిన కాలనీవాసులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్న మహిళ రాపెల్లి గీతపై ఇద్దరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన వృద్ధుడు కోనేటి ఎల్లయ్యపై దాడికి దిగారు. ఓ వ్యక్తి పారిపోగా ఆగ్రహించిన కాలనీవాసులు సిరిసిల్ల పట్టణానికి చెందిన వ్యక్తి మల్లేశంను పట్టుకుని తాడుతో కట్టేసి చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేటలో గీత తన భర్త కృష్ణకాంత్‌తో కలిసి జీవిస్తోంది. ఆమెకు తన తండ్రి నుంచి వచ్చిన ఆస్తిని పేరు మార్పిడి కోసం కుటుంబ, నివాస ధ్రువీకరణ పత్రం అవసరమైంది. దాంతో గీత భర్త కృష్ణకాంత్ సిరిసిల్లలో పనిచేస్తున్న చోట పరిచయమున్న ఇద్దరు వ్యక్తులు మల్లేశం, గణేశ్‌లకు విషయం చెప్పాడు. తమకు పరిచయమున్న సిరిసిల్లలోని మాసాల గణేశ్ ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తాడని అందుకు రూ.30 వేలు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కృష్ణకాంత్ రూ.30 వేలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. మాసాల గణేశ్‌కు రెండు విడతల్లో రూ.7,500 వేలు ఆన్‌లైన్ ద్వారా పంపించాడు. తమకు డబ్బులు ఇవ్వాలని మల్లేశం, గణేశ్‌లు కృష్ణకాంత్‌ను ఒత్తిడి చేశారు. మల్లేశం, గణేశ్‌లు ఎల్లారెడ్డిపేటలోని మహిళ గీత ఇంటిలోనికి చొరబడి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె కేకలు వేయడంతో మల్లేశం ఆమెపై ముసుగు వేయగా గణేశ్ గొంతు నొక్కేందుకు సిద్ధమయ్యాడు. అరుపులు విన్న వృద్ధుడు కోనేటి ఎల్లయ్య, అతని కొడుకు అంజనేయులు చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. గణేశ్ అక్కడ నుంచి తప్పించుకున్నాడు. మల్లేశం పారిపోతున్న క్రమంలో పట్టుకునేందుకు ఎల్లయ్య యత్నించడంతో కర్రతో దాడి చేయడం వల్ల తలకు బలమైన గాయమైంది. కాలనీవాసులు అప్రమత్తమై మల్లేశంను పట్టుకుని కట్టేసి చితకబాదారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మల్లేశంను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. బాధితురాలు గీత ఫిర్యాదు మేరకు మల్లేశం, గణేశ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాహుల్‌రెడ్డి తెలిపారు.





నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు, గాయపడిన వృద్ధుడు ఎల్లయ్య

ఇద్దరి బైండోవర్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లోకి ప్రవేశించి చెట్లను తొలగించడంతో పాటు చదును చేసిన సంఘటనలో కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హీరామండి, పాపియను తహసీల్దార్ ముక్తర్‌పాషా ఎదుట హాజరు పరిచామని ఎస్ఐ లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. వీర్నపల్లి మండలం శాంతినగర్ శివారులోని అటవీ భూములను హీరామండి, పాపియ చదును చేసేందుకు వచ్చారని పేర్కొన్నారు. ముందస్తు చర్యలో భాగంగా తహసీల్దార్ ముక్తర్ పాషా ఎదుట బైండోవర్ చేశామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

రూ. 80 వేలు సీజ్

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కాల్వశ్రీరాంపూర్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ వెంకటేష్ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కాల్వశ్రీరాంపూర్ చెందిన ఆరే మల్లారెడ్డిని తనిఖీ చేయగా రూ.80 వేల నగదు లభించింది. దీంతో అతని నుంచి వివరాలు సేకరించగా సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేత్రదానం

శంకరపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కటికరెడ్డి సుమంత్ (నరేష్‌రెడ్డి) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా కుటుంబ సభ్యుల అంగీకారంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి వారు నేత్రాలు సేకరించారు. పుట్టెడు దుఃఖంలో నేత్రదానానికి అంగీకరించిన కుటుంబసభ్యులను గ్రామస్థులు అభినందించారు.

యోగా పోటీల్లో పతకాలు సాధించాలి



యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యోగాసన పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా యోగా క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 12 వరకు మైసూర్‌లో జరగనున్న 50వ సీనియర్స్ జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. జాతీయస్థాయి పోటీలకు పురుషుల విభాగంలో పి స్వరూపచారి, ఎల్ కోటేశ్వర్‌రావు, మహిళల విభాగంలో జె ఆమని, పి సుగుణ, బి ప్రవళిక ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, యోగా కోచ్‌లు వి కిష్టయ్య, జి రామకృష్ణ, పి మల్లేశ్వరి పాల్గొన్నారు.



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

జాతీయ యోగా పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో మైసూర్‌లో జరగనున్న 50వ జాతీయ యోగా పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారులు పసుపుల ప్రణయ్, గోక వినోద్‌కుమార్, ఓరగంటి రామకృష్ణ జాతీయ యోగ సీనియర్ విభాగం పోటీలకు ఎంపికావడంతో మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, యోగ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, యోగ సాధకులు అశోక్, లావణ్య, దేవయ్య, కనకయ్య, శ్రీదేవి, తిరుపతి అభినందించారు. ఈ నెల 8 నుండి 15వ తేది వరకు మైసూర్‌లో జరిగే 50 జాతీయ యోగ పోటీలకు జిల్లా క్రీడా కారులు పసుపుల ప్రణయ్, గోక వినోద్‌కుమార్, ఓరగంటి రామకృష్ణ తరలివెళ్లారు.

వైభవంగా కోజాగరి పౌర్ణమి వ్రతపూజ

పాలల్లో చంద్రుడిని దర్శించుకున్న భక్తులు



రాజన్న ఆలయంలో కోజాగరి వ్రతపూజకు హజరైన భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం రాత్రి కోజాగరి పౌర్ణమి వ్రతపూజను అర్చకులు వైభవంగా చేపట్టారు. ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా రాజన్న ఆలయంలో రాత్రి 12 గంటల వరకు కోజాగరి (మహాలక్ష్మీ, క్షీరచంద్ర) పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాలలో చంద్రుడిని దర్శించకున్నారు. కోజాగరి పూర్ణిమ వ్రతం రోజున పాలలో చంద్రుడిని దర్శించుకుంటే జన్మ ధన్యమవుతందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

రేవతి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పార్వతిరాజరాజేశ్వర స్వామివారలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పరివార దేవతార్చనలు నిర్వహించగా శ్రీ అనంతపద్మ నాభ స్వామి వారికి పంచోపనిషత్ ద్వారా అభిషేకం చేపట్టారు.





పాలల్లో చంద్రుడిని దర్శించుకుంటున్న భక్తులు, అర్చకులు

ప్రణాళిక ప్రకారం విస్తరణ పనులు పూర్తి చేయాలి

- రాజన్న సిరిసిల్ల కలెక్టర్ ఎం. హరిత
- రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- భీమేశ్వర ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన

వేములవాడ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. రాజన్న, భీమేశ్వర ఆలయంలో జరుగుతున్న అభిషేకం, అన్నపూజ, కోడె క్యూలైన్ కౌంటర్స్ ప్రసాదం తయారీ విభాగం, నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం మండపాల పనులను మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆలయ అతిథి గృహంలో వీటీడీఏ, ఆలయ అధికారులు, అర్చకులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధిపై రూపొందించిన నమూనాను కలెక్టర్‌కు క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి వివరించారు. ప్రస్తుతం భవనాల కూల్చివేత పనులు, ప్రణాళిక ప్రకారం చేపడుతున్న చర్యలపై ఆరాతీశారు.



భీమేశ్వర ఆలయంలో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిత

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ఆలయ విస్తరణకు పెండింగ్ పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రోజువారీగా చేపట్టే పనుల వివరాలు ఇవ్వాలని సూచించారు. నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. వచ్చే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ముందు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేసేందకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సంబంధిత ఉద్యోగులను ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్‌రెడ్డి, ఆలయ ఈవో రమాదేవి, క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య సత్యనారాయణ మూర్తి, అధికారులు నరసింహచారి, అన్వేష్, విజయప్రకాశ్‌రావు, అన్సార్ ఉన్నారు.

'నవోదయ' దరఖాస్తు గడువు పొడిగింపు

చొప్పదండి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 వరకు గడువు ఉందని, ప్రస్తుత విద్యాసంవత్సరంలో 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సారెస్పీకి 1,51,480 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 37 గేట్లు ఎత్తి 1,51,480 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 650, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవం



రథంపై కొలువుదీరిన శ్రీవారు



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- భక్తులకు రథంపై దర్శనమిచ్చిన గోవిందుడు
- స్వామి వారిని దర్శించుకున్న విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కేటీఆర్



శ్రీవారి రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

సిరిసిల్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల జయజయధ్వానాలతో 30 అడుగుల ఎత్తుతో ఉన్న రథంలో స్వామివారిని సిరిసిల్ల పట్టణంలో ఊరేగించారు. రథయాత్రను చూడడానికి సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాలతో పాటు మహా రాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు రథాన్ని లాగుతూ తమ భక్తిని చాటుకున్నారు. ప్రతియేటా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవోపేతంగా జరుగుతాయి.

మహారథంపై శ్రీస్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పంటలతో రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం దేవాలయం సిబ్బంది, అర్చకులు ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్మల స్వరూప తిరుపతిరెడ్డి, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, కాంగ్రెస్ జిల్లా మహిళ అధ్యక్షురాలు కాముని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు. రథోత్సవాన్ని సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ముందుగా స్వామి వారిని దర్శించుకొని కేటీఆర్ పూజలు నిర్వహించారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పట్టణ మహిళ విభాగం అధ్యక్షురాలు బత్తుల వనజ, మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు. వెంకటేశ్వర స్వామిని జిల్లా జడ్జి డి నీరజ, ఎస్పీ మహేష్ బీ. గితే వేర్వేరుగా దర్శించుకున్నారు. రథోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పెద్ద బజారు, గాంధీచౌక్, అంబేద్కర్ నగర్ నుంచి వాహనాలు రాకుండా పోలీసులు బారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం రద్దు చేయడంతో భక్తులు మండిపడ్డారు.

వరద ప్రదాయిని

- వరద కాలువ నీటితో జోరుగా పంటల సాగు
- సాగులోకి బీడు భూములు..



వరదకాలువ

మల్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రవహించే వరద కాలువ రైతులకు వరప్రదాయినిగా మారింది. ఒకప్పుడు నీటి సౌకర్యం అంతంతమాత్రమే అందుబాటులో ఉండడంతో రైతాంగం సాగు నీటి కోసం అనేక ఇబ్బందులు పడగా ప్రస్తుతం వరద కాలువతో సాగు విస్తీర్ణం పెరిగింది. పదేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన వరద కాలువ మండలంలో దాదాపుగా 15 కి.మీ.ల మేర ప్రవహిస్తుండగా ఆ నీటితో చెరువులు, కుంటల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో ఒక్క మల్యాల మండలంలోనే గతంలో కంటే దాదాపు 5వేల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

గతంలో వానాకాలం పంటలను కొంత మేరే సాగు చేయగా ఇప్పుడు రెండు సీజన్లలో పంటలు సాగు అవుతున్నాయి. మెట్ట ప్రాంతమైన మల్యాల మండలంలోని రైతులు వ్యవసాయ బావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో వరద కాలువ రాక ముందు సుమారు 9వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా ఇప్పుడు 14వేల ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. వరితో పాటు మొక్కజొన్న, పత్తి, పసుపు తదితర పంటలు సాగవుతున్నాయి. మల్యాల మండలంలోని సర్వాపూర్, ముత్యంపేట, మల్యాల, నూకపెల్లి, రామన్నపేట, గొల్లపల్లె, రాంపూర్ గ్రామాల పరిధిలో వరద కాలువలో నిరంతరం నీరు ఉంటుండడంతో కాలువ వెంబడి గల ఉన్న వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు పెరిగాయి. వరద కాలువ నీటితో తాటిపెల్లి పెద్ద చెరువు, పోతారంలోని చెరువును నింపుతున్నారు. దీంతో ఆయా చెరువుల కింద వందలాది ఎకరాల్లో రైతులు పంటల సాగు చేస్తున్నారు. వందలాది మంది ఒగులాపూర్, మద్దుట్ల, మల్యాల, ముత్యంపేట, సర్వాపూర్, బల్వంతాపూర్‌కు చెందిన రైతులు వరద కాలువ నుంచి వ్యవసాయ పొలాలకు కిలోమీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఈ ప్రాంతంలో సాగు విస్తీర్ణం పెరిగి వరద కాలువ వరప్రదాయినిగా మారిందని పేర్కొంటున్నారు.

వరద కాలువపై పంప్‌హౌస్

మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో వరద కాలువ 73 కి.మీ వద్ద పంప్‌హౌస్ నిర్మాణం కూడా రైతులకు వరంగా మారినట్లు అయింది. ఎత్తి పోతలు లేని సమయంలో గేట్లు మూసి ఉండడంతో కాలువలో నీరు నిరంతరం నిలిచి ఉంటుంది. దీనికి తోడు నూకపల్లి శివారులో గల వరద కాలువ 77 కి.మీ వద్ద క్రాస్ రెగ్యులరేటర్ నిర్మాణంతో నాలుగు కిలోమీటర్ల మేర కాలువలో నీరు నిలిచి నూకపల్లి, రామన్నపేట, మద్దుట్ల, గొల్లపల్లె గ్రామాల రైతులకు నీరు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుంది. దీంతో మల్యాల మండల వ్యాప్తంగా వరద కాలువతో సాగు, తాగునీరుకు ఢోకా లేకుండా పోయింది.



పెరిగిన వరి సాగు

రాంచందర్‌రెడ్డి, రైతు, ముత్యంపేట



వరద కాలువ నీటితో భూగర్భ జలాలు పెరిగాయి. వరద కాలువతో యేటా రెండు పంటలు వరి సాగు చేస్తున్నాం. గతంలో ఈ ప్రాంతంలో సాగు నీటికి అనేక ఇబ్బందులు పడగా ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. వరద కాలువపై నిర్మించిన పంప్‌హౌస్‌లతో నీరు ఎల్లప్పుడూ కాలువలో నిలిచి ఉండడంతో రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.

శివ పార్వతుల కల్యాణం

తంగళ్లపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీ శివలింగ భక్త మార్కండేయ దేవాలయంలో శివ పార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. మంగళవారం పురోహితుల వేద మంత్రాలు భక్తుల శివనామస్మరణతో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పద్మశాలి సంఘం అధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

శివకేశవుల రథోత్సవం

ముస్తాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీశివకేశవుల ఆలయంలో రథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ మిరుదొడ్డి శరయ్య అధ్వర్యంలో వేద పండితులు హరీశ్‌శర్మ తదితరుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతులు, లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను వేరువేరు రథాలపై పుర వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతుల నడుమ ప్రత్యేక అలంకరణలు, ఏర్పాట్లు, దాండియా ఆటల మధ్య శివకేశవుల రథోత్సవం కోలాహలంగా సాగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి, ఆగుళ్ల రాజేశం, బండి ఎల్లం, దొరగొల్ల బాలయ్య, సంతోష్‌రావు, రాంచంద్రం, బండారి సత్తయ్య, తాళ్ల రాజు, కోడె శ్రీనివాస్, జనగామ శ్రీనివాస్, పర్శ తిరుపతి, భక్తులు, పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

గంబీరావుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారాం బజార్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య అత్యంత వైభవంగా కల్యాణం సాగింది. నాఫ్స్‌కాప్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావుతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు, పలువురు నాయకులు కల్యానం తిలకించి స్వామి వారిని దర్శించుకున్నారు.

పెన్షనర్ల బకాయిలు ఇచ్చే వరకు ఆందోళన

రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు ఇచ్చే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని రేవా(రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి అన్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రధానకార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఏడాదిన్నరగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత వెంట నే రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్స్ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఉండేది కాదన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న కొహెడ చంద్రమౌళి

ఈ విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతోందని, అందుకే ధర్నా చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. ఉపాధ్యక్షులు గద్దె జగదీశ్వరచారి, ఎం.భారతి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ బకాయిలు వచ్చే వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని అన్నారు. బకాయిలు రాక పిల్లల పెళ్లిల్లు చేయలేక పోతున్నామని, ఇల్లు కట్టుకోలేకపోతున్నామని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రయోజనాలు ఇవ్వాలని, లేని పక్షంలో ఆరమణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోశాధికారి కనపర్తి దివాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి కె.భోగేశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె. దేవదాసు, సిద్దిపేట జిల్లా బాధ్యుడు కిషన్ నాయక్, రాములు, జగిత్యాల జిల్లా బాధ్యుడు ఎం.రామిరెడ్డి, సిరిసిల్ల జిల్లా బాధ్యుడు మల్లారపు పురుషోత్తం, పెద్దపల్లి జిల్లా బాధ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామిని మంగళవారం వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద పూజలు చేశారు.



కొండగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కొండగట్టులో గిరిప్రదక్షిణ

కొండగట్టు ఆంజనేయస్వామి గిరుల చుట్టూ మంగళవారం గిరిప్రదక్షిణ నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదిక్షణ ప్రారంభించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- జాతీయస్థాయి ఫారెస్ట్ క్రీడల్లో పతకాలు సాధించాలి
- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంకవర్గీస్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంకవర్గీస్ అన్నారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాల మైదానంలో మంగళవారం రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు మైదానంలో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఇలాంటి క్రీడలు ఉద్యోగులకు ఆటవిడుపుగా పని చేస్తాయని, తిరిగి విధుల్లో పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు ఉపయోగపడతాయన్నారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని, జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతకు ముందు కరీంనగర్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల నుంచి హాజరైన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్‌తో అతిథులకు క్రీడా వందనం సమర్పించారు. వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్ తదితర క్రీడలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ఎఫ్ఆర్‌వో బాలమని, మెదక్ ఎఫ్ఆర్‌వో జోజి, ఇతర జిల్లాల ఎఫ్ఆర్‌వోలు, డీవైఎస్‌వో వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంకవర్గీస్

వర్షాలకు నేలవాలిన వరి పంట

అన్నదాతలకు ఆర్థిక భారం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): వరి పంట చేతికందే సమయంలో కురిసిన వర్షాలకు పైరు నేలవాలడంతో కోతకు అన్నదాతలకు తంటాలు పడుతున్నారు. పొలంలో వర్షపు నీరు నిలిచి యంత్రాలు దిగబడడం వల్ల కోతకు వీలు లేకుండా ఉన్నది. దీంతో గత్యంతరం లేక కూలీలతో కోయాల్సిన దుస్థితి దాపురిస్తోంది. కోసిన పంట తడిసిపోవడం వల్ల ఆరబెట్టడం మరో ప్రయాసగా మారింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, బండలింగంపల్లి, హరిదాస్‌నగర్, పదిర తదితర గ్రామాల్లో సాగు చేసిన వరి పంటకు కోత దశకు చేరుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పైరు నేలవాలిపోయింది. కోయకపోతే ఉన్న పంట పొలంలోనే మొలక వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాలు బురదలో దిగబడి పోవడంతో రైతులు కూలీలతో కోయించి ఆరబెట్టేందుకు అవస్థలు పడుతున్నారు. యంత్రాలకు గంటకు సుమారు రూ.3 వేలు చెల్లించాల్సిన దర వర్షంతో నేలవాలిన పైరుకు సుమారు రూ. 9 వేలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. యంత్రాలు దిగబడడం వల్ల మిగిలిన వరి పంటను కోసేందుకు ఒక్కో కూలీకి రూ.600 వెచ్చిస్తున్నామని చెబుతున్నారు.



నేలవాలిన వరి పంట

ఆరు లక్షల పెట్టుబడి పెట్టా..

మేడిశెట్టి వజ్రవ్వ, వెంకటాపూర్



మాకున్న నాలుగెకరాలతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేశా. సాగుకు మొత్తం రూ. 6 లక్షల పెట్టుబడి పెట్టా. పంట కోత దశకు వచ్చిన సమయంలో గాలివానకు ఐదు ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. పొలం వాన నీళ్ల ఉండడంతో వరి కోత యంత్రం దిగబడింది. కూలీలను పెట్టి కోయిస్తున్నా.



తడిసిన వరిని ఆరబెడుతున్న రైతు

● సంక్షిప్తంగా..

రామడుగు: కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని వెలిచాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ పాల్గొన్నారు.

భగత్‌నగర్: ఏసీ పితామహుడు విల్లీస్ కెరియర్ వర్ధంతి సందర్భంగా నగరంలోని మంకమ్మతోటలో ఏసీ టెక్నీషియన్స్ నివాళులు అర్పించారు. టీఎన్‌జీఓస్ అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్, పి.ప్రతాప్‌రావు పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని ఎక్లాస్‌పూర్ మాజీ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, వెన్కేపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి తల్లి కొత్త సుశీలదేవి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మంగళవారం ఎక్లాస్‌పూర్‌లో పరామర్శించారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని కందుగులకు చెందిన మాజీ జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గన్నేరువరం: కరీంనగర్ జిల్లా జాగృతి అధ్యక్షుడిగా నియామకమైన గుంజపడుగు హరిప్రసాద్‌ను నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మెట అనిల్ మంగళవారం సన్మానించారు. నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ప్రముఖ వేదపండితుడు అవధానుల దత్తాత్రేయశర్మ (దత్తయ్య) ఇటీవల మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో పేరాల గోపాల్‌రావు, కటంగూరి రామచంద్రారెడ్డి, తుమ్మల శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సంస్కృత, సాహిత్యంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్లు వేణుమాధవ్, ఖాదర్‌మొహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్‌రెడ్డి, ఎస్‌ఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కరీంనగర్ క్రైం: పోలీస్‌కమిషనరేట్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి అడిషనల్ డీసీపీ వెంకటరమణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కిరణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఈ-టెక్నోలో..

భగత్‌నగర్: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి ప్రపంచానికి ఎంతో జ్ఞానాన్ని అందజేశారన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి.రాజిరెడ్డి, జేఏవో రాజశేఖర్‌రెడ్డి, టీపీబీవో దీపిక, సీనియర్ అసిస్టెంట్లు వాణి, భాస్కర్, శ్రీనివాస్, శానిటరి ఇన్‌స్పెక్టర్లు మహేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.





పూలమాల వేస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, అల్ఫోర్స్‌లో పాల్గొన్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కవిత్వ వారసత్వాన్ని కొనసాగించాలి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ కవిత్వ వారసత్వాన్ని కొనసాగించాలని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రతీ నెలా పౌర్ణమికి నిర్వహించే ఎన్నీల ముచ్చట్ల సాహిత్య గోష్ఠికి మంగళవారానికి 150 నెలలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కవి అన్నవరం దేవేందర్ ఆతిథ్యంలో భగత్‌నగర్ మారుతి హెవెన్స్ డాబాపై ఎన్నీల ముచ్చట్లు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఆధునికత అవసరమేగానీ మన చరిత్రను తెలుసుకోకుండా ఆధునికత వెంట మాత్రమే వెళ్లడం మంచిది కాదన్నారు. 150 నెలల ఎన్నీల ముచ్చట్లు జరుపుకోవడం విశేషమన్నారు. చరిత్ర పరిశోధకుడు కరివేరాజ్‌కుమార్ చరిత్ర విశేషాలను వివరించారు. ఆదివాసీ వీరుడు కొమురంభీం, ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్‌కు నివాళులర్పించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య, కె.సంతోష్‌బాబు, పీఎస్ రవీంద్ర, గజేందర్‌రెడ్డి, కందుకూరి అంజయ్య, కూకట్ల తిరుపతి, బి.తిరుపతి, రమణయ్య, యుగంధర్, విలాసాగరం రవీందర్, నసీరుద్దీన్, ఎండీ ఖాలిద్, బసవేశ్వర్, నిర్మలారాణి, సరసిజ, హరిప్రియ, విజయశ్రీ, శ్రీనివాసాచారి, మహేందర్‌రాజు, ప్రవీణ్, మహేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



150వ ఎన్నీల ముచ్చట్లలో కవులు, రచయితలు

కరీంనగర్‌లో ఐటీ అధికారుల తనిఖీలు?

కరీంనగర్ క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఆదాయ పన్ను శాఖకు చెందిన రెండు బృందాలు మంగళవారం కరీం నగర్‌లో రెండు చోట్ల తనిఖీలు చేపట్టినట్లు ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని ఎవరూ ధృవీకరించలేదు. నగర శివారులోని గ్రానైట్ ఫ్యాక్టరీ, క్వారీల్లో ఒక బృందం, కరీం నగర్ శివారులోని ఓ ప్రైవేట్ వైద్య కళాశా లలో మరో బృందం తనిఖీ చేసినట్లు ప్రచారం జరిగింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల్లో భాగంగా బుధవారం రేకుర్తి, సీతరాంపూర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేయాలి

గంగాధర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రవేశపెట్టిన ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేయాలని ఆ సంఘం ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో నియోజకవర్గ ఐక్యవేదిక సభ్యులు విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గురు పిల్లలను కనడమే మేం చేసిన పాపమాని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీసుకొచ్చిన జీవోను ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటు తర్వాత అక్కడ ఎత్తివేశారన్నారు. మరి తెలంగాణ ప్రజలు ఏం అన్యాయం చేశామని పాలకులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనను ఎత్తి వేసి ప్రస్తుత ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్నారు. సంఘం సభ్యులు వొడ్నాల లక్ష్మణ్, మల్యాపుర రాజేశం పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

భగత్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, బెస్ట్ అవలైబుల్ పాఠశాలల విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నాగుల జ్ఞానేశ్వర్, అజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నం హేయమైన చర్య

కరీంనగర్ క్రైం/జమ్మికుంట అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై ఓ మతోన్మాది షూతో దాడికి యత్నించడం హేయమైన చర్యని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం సైదాబాద్‌లో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాకేష్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ గ్రామ పంచాయతీ సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు జక్కుల రమేష్, దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. కోర్టు ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ సభ్యులు సిరికొండ శ్రీధర్ రావు సీనియర్ న్యాయవాదులు కొరివి వేణుగోపాల్,ఎర్రం రాజిరెడ్డి, సజన్ కుమార్,గడ్డం లక్ష్మణ్, కల్లెపల్లి లక్ష్మయ్య, భూక్యా రజనీష్, బొడ్డు రాజు, పూరెల్లి రాములు,దాస్యం శ్రీధర్,జిల్ల రమేష్, ప్రదీప్ కుమార్,గణేష్ కరుణశ్రీ, స్వరూప, హేమలత తదితరులు పాల్గొన్నారు.

భగత్‌నగర్: న్యాయమూర్తిపై దాడి యత్నం వ్యక్తిగత దాడి కాదని, సంపూర్ణ న్యాయ వ్యవస్థపైనే జరిగిన దాడి అని ఐఏఎల్ రాష్ట్ర సమితి సభ్యుడు బోనగిరి మహేందర్ అభిప్రాయపడ్డారు.

గణేశ్‌నగర్: సీజేఐపై దాడిని ఖండిస్తూ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటనను సమాజంలోని అన్ని వర్గాలు దాడిని ఖండించాలన్నారు. భీమ్ ఆర్మీ తెలంగాణ చీఫ్ వాసాల శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై, న్యాయవ్యవస్థపై బీజేపీ ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రలలో భాగమేనని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై న్యాయవాది రాకేష్‌కిషోర్ షూ విసరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని భీమ్ ఆర్మీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినిపల్లి చంద్రయ్య అన్నారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. భీమ్ ఆర్మీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద స్వేరో నెట్‌వర్క్, తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు నిరసన తెలిపారు. నాయకులు అనిల్‌కుమార్, తడగొండ ప్రవీణ్‌కుమార్, కోలపురి దుర్గాప్రసాద్, చిలుముల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



కరీంనగర్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీక్ష

ఎల్ఎండీ గేట్ల మూసివేత

తిమ్మాపూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎల్ఎండీ గేట్లను నీటిపారుదల శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం మూసివేశారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలకు 23.602 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టులోకి 5,191 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో, 2,277 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది.

బోధనలో నూతన సాంకేతికతను ఉపయోగించాలి

భగత్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బోధనలో సాంకేతికతను ఉపయో గించుకోవాలని ఉపాధ్యాయులకు డీఈవో శ్రీరాం మొండయ్య సూచించారు. కొత్తపల్లి (హ) పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఎఆర్), వర్చువల్ రియాలిటీ (విఆర్) టెక్నాలజీ సైన్స్ లాబ్‌ను మంగళవారం ప్రారంభించారు. పాఠశాలల్లో అభ్యసన అనుభవాన్ని ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఎఆర్), వర్చువల్ రియాలిటీ (విఆర్) టెక్నాలజీ మార్చేస్తుందన్నారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ జయపాల్‌రెడ్డి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు కన్నం రమేష్ పాల్గొన్నారు.

కోజాగరి పౌర్ణమి హోమం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం శంకర్ ఆర్యాన్ ఆధ్వర్యంలో కోజాగరి పౌర్ణమి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోల అన్నారెడ్డి, పులాల శ్యాం, డాక్టర్ శ్రీనివాస్, వకుళాదేవి, సముద్రాల రాజమౌళి, డాక్టర్ రమణాచారి, సత్యనారాయణ, దేవేందర్‌రావు, శ్రీనివాస్, సత్య విద్యాసాగర్, పూర్ణచందర్, ముకుందం, రాంప్రసాద్, దీన్‌దయాళ్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయంలో పోచమ్మ తల్లి నాభిశిల, భూలక్ష్మీ మహాలక్ష్మీ అమ్మవార్ల ఐదో వార్షికోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

గీష్పతి పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక భవానీ సాహిత్య వేదిక కార్యాలయంలో మంగళవారం సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ఉపాధ్యాయ కవి కేవీ గోపాలాచార్య రచించిన గీష్పతి పుస్తకాన్ని తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. అన్నాడి గజేందర్‌రెడ్డి పుస్తక పరిచయం చేశారు. కార్యక్రమంలో నగునూరి రాజన్న, మఠం సాంబమూర్తి, డాక్టర్ తిరుమల్‌రెడ్డి, బొమ్మకంటి కిషన్, పిఎస్ రాజు, ఆర్ శ్యామసుందర్, సంగోజు శ్రీనివాస్, కసిరెడ్డి జలంధర్‌రెడ్డి, బోడకుంట రమేశ్, నైతం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు

ఇల్లందకుంట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో మేరా యువ భారత్ కరీంనగర్, శివరుద్ర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, యువజన సంఘం అధ్యక్షుడు గుత్తికొండ పవన్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10వ తేదీల్లో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు (టోర్నమెంట్) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో భాగంగా వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షార్ట్ పుట్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ముందుగానే రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9573132114 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

హుజూరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణ శివారులో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి పొన్నం దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలంగాణ చౌక్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ మాట్లాడుతూ దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై పొన్నం వ్యాఖ్యలు సరికాదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పకపోతే జిల్లాలో తిరగనీయబోమన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌పై పొన్నం వ్యాఖ్యల సందర్భంలో దళిత సామాజిక వర్గానికి చెందిన వివేక్ వెంకటస్వామి మౌనం వహించడం బాధాకరమన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చెంచాల నవీన్ మాదిగ, తడగొండ శంకర్ మాదిగ, చిలుముల రాజయ్య మాదిగ, కొత్తూరి రాజన్న మాదిగ, దండు వరలక్ష్మిమాదిగ, కనకం అంజి బాబు మాదిగ, శెనిగరపు కొమురయ్య మాదిగ, తాటిపల్లి సంపత్ మాదిగ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



వంకాయగూడెంలో పాల్గొన్న అధికారులు

శంకరపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం, కాచాపూర్‌లో మంగళవారం విద్యుత్ అధికారులు పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా తాడికల్ సబ్‌స్టేషన్ పరిధిలోని వంకాయగూడెంలో ఏఈ సంపత్‌రెడ్డి, ఆము దాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కాచాపూర్‌లో ఏఈ రఘు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విద్యుత్ మోటర్లకు కెపాసిటర్లు పెట్టుకుంటేనే లాభదాయకమన్నారు. రైతుల సమస్యలపై అధికారులు స్పందించకుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు

గన్నేరువరం: మండల కేంద్రంలో మంగళవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. నుస్తులాపూర్ ఏడీఈ శ్రీనివాస్, మండల ఏఈ అంజనేయులు హాజరై రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మోటార్ల వద్ద కెపాసిటర్లు వాడటం వలన కలుగు ప్రయోజనాలను వివరించారు.

మహిళలకు రక్షణగా.. నారీ శక్తి బ్లూ కోల్ట్స్

వీణవంక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నారీ శక్తిలో భాగంగా మహిళల భద్రత కోసం మహిళా బ్లూ కోల్ట్స్ స్పెషల్ పోలీస్ సిబ్బందిని ఏర్పాట్లు చేసినట్లు జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నారీ శక్తి బ్లూ కోల్ట్స్ వాహనాలను సీఐ ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల పట్ల కాలేజీల వద్ద ఆకతాయిలను అరికట్టేందుకు ఈటీం పనిచేస్తుందన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైతే వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు. ప్రతీరోజు మండల వ్యాప్తంగా బ్లూకోల్ట్స్ సిబ్బంది ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ తిరుపతి పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కరీంనగర్ సీపీ గౌస్ ఆలాం సూచనల మేరకు మండలంలోని ఎల్ఎండీ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో మహిళా బ్లూ కోల్ట్స్‌ను మంగళవారం ప్రారంభించామని ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా సుభాష్ నగర్‌లో మహిళా బ్లూకోల్ట్స్, సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. మహిళలకు సంబంధించి ఏమైనా నేరాలు జరిగినప్పుడు మహిళా బ్లూ కోల్ట్స్ సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.



వీణవంకలో మాట్లాడుతున్న జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ

ఆరుబయట చెత్తవేసిన వ్యక్తికి రూ.500 జరిమానా

కరీంనగర్ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరు బయట చెత్త వేసిన వ్యక్తికి రూ.500 జరిమానా విధించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ తెలిపారు. మంగళవారం తెలంగాణచౌక్ ప్రాంతంలో సదరు వ్యక్తి ఇంటి బయట చెత్త వేస్తుండగా సీసీ కెమెరాల ద్వారా గుర్తించినట్లు పేర్కొన్నారు. చెత్తచెదారాన్ని స్వచ్ఛ ఆటోలు, రిక్షా వారికి ఇవ్వకుండా ఆరుబయట వేస్తే సీసీ కెమెరా పర్యవేక్షణతో గుర్తిస్తామని, చెత్త వేసిన వారి నుంచి జరిమానా వసూలు చేస్తామని అన్నారు. చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు స్వీట్ల పంపిణీ

భగత్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ఆర్టీసీకి అధిక ఆదాయం తీసుకొచ్చిన ఉద్యోగులకు సంస్థ రీజినల్ మేనేజర్ బి.రాజు మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సందర్భంగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిన డ్రైవర్లు, కండక్టర్లు, విధులు నిర్వహించిన మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, పీహెచ్‌బీ/జేబీఎం డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భూపతిరెడ్డి, మల్లేశం, డిపోమేనేజర్లు విజయమాధురి,ఎం.శ్రీనివాస్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అమ్మవారికి సహస్ర దీపారాధన



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): కోజాగిరి పౌర్ణమి సందర్భంగా మంగళవారం కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ పరివార సమేత దుర్గా భవానీ దేవాలయంలో ఆయల ప్రధానార్చకుడు పవన కృష్ణ శర్మ అమ్మవారికి పల్లకి, ఉయ్యాల సేవలతోపాటు సహస్ర దీపారాధన నిర్వహించారు. ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి పాల్గొన్నారు.

మంత్రి పొన్నం వెంటనే క్షమాపణ చెప్పాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకుడు కనకం వంశీకిరణ్ అన్నారు. మంగళవారం మంచిర్యాల చౌరస్తాలోని జగ్జీవన్‌రాం విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పని పక్షంలో క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు తడగొండ సత్యరాజ్‌వర్మ, గొర్రె రాజయ్య, నాగెల్లి బాబూరావు, స్వరూప, తిరుపతి పాల్గొన్నారు.

పడాల రాహుల్ జన్మదిన వేడుకలు

గణేశ్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్టీఏ సభ్యుడు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పడాల రాహుల్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల కృపా సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ చౌక్‌లో కేక్ చేశారు. ఈ సందర్భంగా మాజీ యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆకుల ఉదయ్ మాట్లాడుతూ పడాల రాహుల్ నాయకత్వం పార్టీకి బలాన్ని చేకూర్చుతోందన్నారు. రేకుర్తి అంధుల ఆశ్రమ పాఠశాలలో పిల్లలకి పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గజన్ నాయక్, పట్టణ అధ్యక్షులు ఉప్పరి విశాల్, కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షులు గట్టు ప్రశాంత్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు జెర్రిపోతుల వాసు, ఉయ్యాల వంశీ, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బుస సందీప్, నాయకులు పాల్గొన్నారు.

'దరిపెల్లి'కి గౌరవ డాక్టరేట్ ప్రదానం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్య, సమాజ సేవా రంగాల్లో కృషి చేస్తున్నందుకు కరీంనగర్‌కు చెందిన దరిపెల్లి రాజగోపాల్‌కు (రాజగోపాలాచార్య) సోమవారం రాత్రి హైదరాబాద్ సురానా ఆడిటోరియంలో 'డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ' (డల్లాస్-యుఎస్ఏ) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాజగోపాల్ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. బీఏ, శిక్షాశాస్త్రి, ఎంఏ సంస్కృతం పూర్తి చేశారు. 30 సంవత్సరాలుగా వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల్లోని వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సంస్కృత ఉపన్యాసకుడిగా పని చేశారు.

సైబర్ నేరాల నివారణ చర్యలను బలోపేతం చేయాలి

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నివారణ చర్యలను బలోపేతం చేయాలని డీజీపీ శివధర్‌రెడ్డిని టీపీసీసీ ప్రధానకార్యదర్శి కాశి పాక రాజేష్ కోరారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన బి.శివధర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో పోలీసింగ్, ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయాలని కోరారు. స్థానిక ప్రతినిధులు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సైబర్ భద్రతతోపాటు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తరింప జేయాలన్నారు.

ఎంపీటీసీ ఎన్నికలకు దరఖాస్తుల స్వీకరణ

రామడుగు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి హరీష్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ ఎన్నికల కోసం పోటీ చేయాలనుకునే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 60 దరఖాస్తులు వచ్చాయి.రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు వెన్న రాజమల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, సింగిల్ విండో చైర్మన్ మురళికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక ధ్యాన కార్యక్రమం

హుజూరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని రాధాస్వామి సత్సంగంలో మంగళవారం ప్రత్యేక ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ సొసైటీ మాస్టర్ అనిల్ మాట్లాడుతూ ధ్యానం సర్వరోగ నివారణగా పనిచేస్తుందన్నారు. శ్వాసపై ఏకాగ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో జ్ఞాన సాధకులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల బకాయిలు విడుదల చేయాలి

హుజూరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25వేలకు పైగా విద్యార్థులకు రూ. 180 కోట్ల బకాయిలను రెండేళ్లుగా విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఉపాధ్యాయులకు పెన్షన్ మంజూరు చేయాలి

భగత్‌నగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెన్షన్ మంజూరు చేయాలని బీజేపీ విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ నరహరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మార్చి 2024 నుంచి రాష్ట్రంలో రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయులకు పెన్షన్, గ్రాట్యుటీ, జీపీఎఫ్ సరెండర్, డబ్బులు విడుదల చేయక పోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాకీ ఉన్న 5 డీఏలు, పీఆర్‌సీ అమలు చేయక పోవడంతో రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రతీ నెల రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోతున్నట్లు చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు విఫలమయ్యాయన్నారు.